## క్లుప్తంగా

### టెట్ ఫీజు తగ్గించాలి

చిట్యాల: టెట్ (ఉపాధ్యాయ అర్హత) ఫీజు తగ్గించాలని డీవైఎఫ్ఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో బుధవారం ఆయన మాట్లాడారు. గతంలో మూడు వందల రూపాయలున్న ఫీజును వెయ్యి రూపాయలకు పెంచడం సరైంది కాదన్నారు. పెంచిన ఫీజులతో నిరుద్యోగ యువతకు భారం మారిందని, గతంలో ఉన్న ఫీజులను అమలు చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిట్ట రమేష్, అవిశెట్టి కిరణ్, బూరుగు గోపీకృష్ణ, ఆడేపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### తప్పుడు ప్రచారం నమ్మొద్దు

శాలిగౌరారం: బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. తానంటే గిట్టని గ్రామానికి చెందిన కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

### రెడ్‌క్రాస్ భవన్‌లో రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

నల్లగొండ టూటౌన్ : యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు అల్లుబెల్లి రామిరెడ్డి అన్నారు. సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా బుధవారం నల్లగొండలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ భవన్‌లో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇచ్చే రక్తం ఎంతో మందికి ఆపదలో ప్రాణాలు కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, రామ్‌చరణ్ యువత అధ్యక్షుడు సురేష్, పట్టణ అధ్యక్షుడు హైమద్, ముఖేష్, వెంకన్న, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సరోజకు సావిత్రీబాయి పూలే అవార్డు


సరోజను సన్మానిస్తున్న మహిళలు

నల్లగొండ టౌన్ : అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజకు సావిత్రిబాయి పూలే స్మారక అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మహిళలు సరోజను సన్మానించారు.

### బహుమతులు అందజేత


బహుమతి అందజేస్తున్న ఎఫ్‌సీఐ అధికారి ప్రసాద్

నల్లగొండ: భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 23 వరకు పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వంటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎఫ్‌సీఐ సీనియర్ అధికారి కె.ఎస్.కె. ప్రసాద్ బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రఘుపతి, బిల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### నిరుపేద కుటుంబానికి చేయూత


బియ్యం అందజేస్తున్న నరేందర్‌యాదవ్

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన నెమ్మాది బాలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బుధవారం స్థానిక కాంగ్రెస్ నేత, ఐటీసీఎల్ డీలర్ బడుగుల నరేందర్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలమ్మ దశదినఖర్మ నిర్వహణ కోసం 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కంపసాటి కృష్ణయ్య, గూడపూరి బాలరాజు, కోట శ్రీనివాస్, వినయ్‌సాగర్, యాదగిరి, గోళ్ళ అనిల్, ఈట మహేష్, గూడపూరి జానీ, నెమ్మాది మహేష్, జగదీష్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# డంపింగ్ యార్డుగా నీటికుంట !


చిట్యాల పట్టణ సమీపంలో హైవే పక్కన చెత్తాచెదారంతో నిండిపోయిన పోతరాజు కుంట

- పోతరాజుకుంటను చెత్తతో నింపుతున్న చిట్యాల మున్సిపల్ సిబ్బంది
- నీరులేక కుంట కనుమరుగు
- చెత్తను కాలుస్తుండడంతో పొగతో కాలనీవాసుల అవస్థలు

చిట్యాల: మున్సిపాలిటీలో చెత్త సేకరణ కొత్త సమస్యలను తెచ్చి పెడుతోంది. ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను డంపింగ్ చేసేందుకు పట్టణంలో స్థలం కొరత ఏర్పడింది. సేకరించిన చెత్తను అందుబాటులో ఉన్న నీరు లేని కుంటలో నింపుతున్నారు. దీంతో కాలుష్యం ఏర్పడి ఆ చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

**చెత్త సేకరణ ఇలా..**

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులుండగా సుమారు 16 వేల వరకు జనాభా, 3453 వరకు ఇళ్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు పది టన్నులకు పైగానే చెత్తను మున్సిపల్ కార్మికులు వాహనాల్లో సేకరిస్తున్నారు. కాగా చిట్యాల పట్టణంలో సేకరించిన చెత్తను ప్రస్తుతం శివనేనిగూడెం రోడ్డుకు వెళ్లే దారిలో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మరికొంత చెత్తను చిట్యాల పట్టణంలోని హైవే రోడ్డు పక్కన పాల కేంద్రం ఎదురుగా ఉన్న పోతరాజుకుంటలో వేస్తున్నారు.

**వాహనదారుల తంటాలు..**

చిట్యాల పట్టణంలోని పాల కేంద్రం ఎదురుగా ఉన్న పోతరాజుకుంట సుమారు ఎకరం పది గుంటల విస్తీర్ణంలో ఉంది. ఈ కుంటలో ప్రస్తుతం నీరు లేకపోవడంతో పట్టణంలో సేకరించిన చెత్తతో నింపుతున్నారు. ఇప్పటికే కుంట మొత్తాన్ని చెత్తతో నింపివేశారు. గతంలో ఈ కుంటలోకి సమీపంలోని ఎత్తైన ప్రదేశాల నుంచి వర్షపు నీరు వచ్చి చేరేది. సమీపంలోని పాలకేంద్రం వైపు ఉన్న ఇళ్లు, దుకాణాల నుంచి వచ్చే మురుగు ఈ కుంటలోకి వచ్చి చేరేది. కానీ హైవే విస్తరణ సమయంలో పాల కేంద్రం వైపు ఎత్తుగా రోడ్డు నిర్మించడంతో కుంటలోకి నీరు రాకుండా పోయింది. దీంతో వర్షం పడినప్పుడు పాల కేంద్రం వైపు ఉన్న దుకాణాల్లో, ఇళ్లలో, ఫంక్షన్ హాల్స్‌లో, రైస్ మిల్లుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరి ఎక్కడిక్కడే నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఈ కుంటలోకి చేర్చిన చెత్తను మున్సిపల్ కార్మికులు ఎప్పటికప్పుడు కాల్చివేస్తున్నారు. దీంతో హైవే వెంట వెళ్లే వాహనాదారులతోపాటు సమీపంలోని ఇళ్లలోని వారు సైతం పొగతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు తగిన చర్యలు తీసుకుని పట్టణానికి దూరంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని, పోతరాజు కుంటను తిరిగి నీటితో నింపాలని ప్రజలు కోరుతున్నారు.

**కుంటను చెత్తతో నింపుతున్నారు**



చిట్యాల పట్టణంలోని హైవే రోడ్డుకు ఆనుకుని ఉన్న పోతరాజు కుంటను మున్సిపల్ అధికారులు చెత్తతో నింపుతున్నారు. ఈ కుంటలోకి చెత్త తరలింపు నిలిపివేయాలి. కుంట పునరుద్ధరణకు మున్సిపల్ అధికారులు, ఐబీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. పట్టణానికి దూరంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి.

-ఎండీ.అక్బర్, చిట్యాల

**పట్టణానికి దూరంగా ఏర్పాటు చేస్తాం**

పట్టణంలోని కుంటలోకి చెత్తను తరలిస్తున్న విషయం తెలిసింది. త్వరలోనే పట్టణానికి దూరంగా మరో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో చర్చించి ప్రతిపాదనలు చేశాం. పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తాం.

-వీరేందర్, మున్సిపల్ కమిషనర్, చిట్యాల

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శాలిగౌరారం: ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని భైరవునిబండ మాజీ సర్పంచ్ దండ రేణుకఅశోక్‌రెడ్డి అన్నారు. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న గ్రామానికి చెందిన ఈదులకంటి జానయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరై రూ.60 వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కు, పడాల వర్షితకు మంజూరైన రూ. 60 వేల చెక్కును బుధవారం గ్రామంలో అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండ అశోక్‌రెడ్డి, నరిగె శంభయ్య, పడాల శంకరయ్య, దండ చంద్రారెడ్డి, ఈదులకంటి శంకరయ్య, లక్ష్మణాచారి, షేక్ గౌస్, సైదులు, లతీఫ్, రాంబాబు, రేణుక, వీరమ్మ, యాకూబ్, నారాయణరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న కాసాల వెంకట్‌రెడ్డి

చండూరు : మండలంలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన కురుపాటి కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని సమాచార హక్కు చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాసాల వెంకట్‌రెడ్డి బుధవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసహాయం అందించారు.

### జంజరాల యాదయ్యకు నివాళి

రామగిరి (నల్లగొండ): తిప్పర్తి మండలం నర్రా రాఘవరెడ్డి భవన్‌లో బుధవారం జంజరాల యాదయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరి వెంకటరమణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మన్నెం భిక్షం, బీరెడ్డి సీతారాంరెడ్డి, సైదులు, భీమగాని గణేశ్, లెనిన్, శరత్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు


కల్యాణం తిలకిస్తున్న భక్తులు


కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

శాలిగౌరారం: మండలంలోని గురుజాల గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీవిశాలాక్షి సమేత కాశీవిశ్వనాథేశ్వరస్వామి ఆలయం పునః ప్రతిష్ఠోత్సవాలు బుధవారం రెండో రోజు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గురుప్రార్థన, మండప దేవతాపూజలు, హోమాలు, ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపన, యంత్ర, విగ్రహ, ప్రాణప్రతిష్ఠాపన, నేతోన్మీలన కుంభదర్శనం, మహాపూర్ణాహుతి, దేవతామూర్తుల కల్యాణోత్సవం, ఆశీర్వచనం కార్యక్రమాలు కనులపండువగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కాగా గురువారం ముగియనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద సుమారు మూడు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పురోహితుడు కొడవగంటి సుబ్రహ్మణ్యశర్మ బృందం నేతృత్వంలో ఆలయ పునఃప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేడుకల్లో గ్రామస్తులతోపాటు చుట్టుపక్కలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పవర్‌లూం కార్మికులకు కూలి పెంచాలి


వినతిపత్రం అందజేస్తున్న దండెంపల్లి సత్తయ్య

నల్లగొండ టౌన్ : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పవర్‌లూం కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ బుధవారం పవర్‌లూం యాజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుపల్లి శ్రీనివాస్‌కు పవర్‌లూం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న కూలీ రేట్లపై 40 శాతం పెంచి ఇవ్వాలన్నారు, ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పనివేళలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పెండెం రాములు, గంజి నాగరాజు, బుచ్చిరాములు, పసునూరి యోగానందం, సూరపల్లి భద్రయ్య, దేవులపల్లి గిరిబాబు, నిమ్మగోటి సైదులు, గంజి చంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

### ఉచితంగా దరఖాస్తులు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినవిధంగా ఉద్యోగ పోటీ పరీక్షలకు ఫీజు లేకుండా ఉచితంగా దరఖాస్తులు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెట్, ఆయన వెంట నోముల క్రాంతియాదవ్, రొమ్ముల నాగయ్య, నోముల శంకర్, సురేష్‌రెడ్డి, సుందర్; కిరణ్, వెంకన్న, లింగస్వామి, హరీష్, గణేష్ తదితరులు ఉన్నారు.

# తాగునీటి సమస్య రాకుండా చూడండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : వేసవి కాలం ప్రారంభమైనందున గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు సూచించారు. నకిరేకల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలు శాఖలపై ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. గత ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయని, ఫలితంగా గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొందన్నారు. గ్రామాల్లో మంచి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అవసరమైతే స్థానిక రైతుల బోర్ల నుంచి నీటిని తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ పర్వేజ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి


నకిరేకల్ : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర


నల్లగొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

నకిరేకల్ : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నకిరేకల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితాను పునః పరిశీలన చేసుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లలో పార్టీలవారీగా ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు జమీరుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, కృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు పన్నాల రాఘవరెడ్డి, కందాల ప్రమీల, ప్రగడపు నవీన్‌రావు, పల్స శ్రీను, యారా శ్రీను పాల్గొన్నారు.

### హోం ఓటింగ్‌పై బీఎల్‌ఓలకు అవగాహన

నల్లగొండ : లోక్‌సభ ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఓటును ఇంటి నుంచి వినియోగించుకోవాలనుకునే వారి నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను ఏ విధంగా పరిశీలించి వారికి ఓటు హక్కును కల్పించాలనే విషయమై నల్లగొండ మండలానికి సంబంధించిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్డీఓ రవి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

## బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రీజినల్ మేనేజర్

నల్లగొండ టౌన్ : ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు రీజినల్ మేనేజర్ రంజయ్‌కుమార్ మిశ్రా అన్నారు. నల్లగొండ పట్టణంలోని రామగిరి రోడ్డులో ఆధునీకరించిన బ్యాంకు భవనం, ఏటీఎం సెంటర్‌ను బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మరో 80 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో కూడా నకిరేకల్, చౌటుప్పల్‌లో బ్రాంచ్ ఏర్పాటు చేయడానికి సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎల్.నాగరాజు, సుధీర్, రాహుల్, దినేష్, సునిత, దీపేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## గుండగోని మైసయ్యకు ఘన నివాళి


నల్లగొండ టూటౌన్ : మైసయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


చండూరు : మైసయ్యగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : బీజేపీ నాయకుడు గుండగోని మైసయ్యగౌడ్ వర్ధంతి సందర్భంగా బుధవారం నల్లగొండలోని ఆయన విగ్రహానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గుండగోని భరత్‌గౌడ్, గుండగోని శ్రీనివాస్, గుండగోని నాగయ్య, గార్లపాటి జితేంద్రకుమార్, బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, చింతా ముత్యాల్‌రావు, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చండూరు: మండల కేంద్రంలో గుండగోని మైసయ్యగౌడ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మైసయ్యగౌడ్ చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోమటి వీరేశం, రైతు సేవ సహకార సంఘం డైరెక్టర్ బోడ ఆంజనేయులు, సముద్రాల వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, నకిరెకంటి లింగస్వామి, బొబ్బిలి మనోహర్‌రెడ్డి, చెరుపల్లి కృష్ణ, బొబ్బిలి శివ, ఇరిగి ఆంజనేయులు, వెంకటాచారి, దుస్స గణేశ్, రవీందర్, జానకి రాములు, వెంకటేశం, రవిరాల శ్రీను, కృష్ణ, రవి, చిట్టిప్రోలు వెంకటేశం, నాగరాజు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలను తొలగించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని కూరగాయల అంగడి స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించి గ్రామ పంచాయతీకి చెందిన స్థలాన్ని కాపాడాలని కోరుతూ బుధవారం నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో డీఎల్‌పీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అధికారి, సిబ్బంది నిర్లక్ష్యంతో పంచాయతీకి సంబంధించిన భూమిని కొందరు ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలకు చెందాల్సిన ఆస్తిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ పోరాటం చేస్తున్న తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. రెండు నెలల క్రితం ఆర్డీఓ, డీఎస్పీ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్వహిస్తున్న దుకాణాలను మూసివేయించినా స్థానిక అధికారులు మళ్లీ తెరిపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మేడబోయిన శ్రీనివాస్, నోముల నాగరాజు, గూడురు అంజిరెడ్డి, నడింపల్లి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## చండూరులో పోలీసుల కవాతు


చండూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చండూరు : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎస్పీ చందనా దీప్తి ఆదేశాల మేరకు బుధవారం చండూరు పట్టణంలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కవాతులో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, చండూరు ఎస్ఐ ఉప్పు సురేష్, మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు, కనగల్ ఎస్ఐ రామకృష్ణ, గట్టుప్పల్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యులుండరు.. సేవలు అందవు !

- శిథిలావస్థకు చేరుకున్న యునానీ వైద్యశాల భవనం
- ఇబ్బందులు పడుతున్న రోగులు


శివన్నగూడలో యునానీ ఆస్పత్రి

మర్రిగూడ: మండలంలో ఫ్లోరైడ్ అత్యధికంగా ఉండడంతో ఫ్లోరైడ్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యసేవలు అందించేందుకు శివన్నగూడ గ్రామంలో ప్రభుత్వం యునానీ ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. కానీ ప్రజలకు సరియైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

**అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్న వైద్యుడు**

మర్రిగూడ మండల వ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకారం 36,968 జనాభా ఉండగా శివన్నగూడలో 3,238 మంది ఉన్నారు. శివన్నగూడలో ఏర్పాటుచేసిన యునానీ ఆస్పత్రి ద్వారా మేటిచందాపురం, కొట్టాల, నామాపురం, సరంపేట, రాంరెడ్డిపల్లి, వెంకేపల్లి, ఖుదాబాక్షపల్లి, అంతంపేట గ్రామాల ప్రజలు వైద్య సేవలు పొందుతుంటారు. ఇటీవల సంబంధిత వైద్యులు నిత్యం అందుబాటులో ఉండడం లేదని, అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నారని, అదికూడా ఒక్క పూటా కూడా పూర్తిగా ఉండడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిత్యం వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

**పదేళ్లుగా పాత భవనంలోనే...**

యునానీ ఆస్పత్రి భవనం దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంది. 2023 సంవత్సరంలో యోగా షెడ్ పథకం కింద మరమ్మతులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.6.50 లక్షలను మంజూరు చేసింది. నిధులున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో శిథిలావస్థలో ఉన్న భవనం ఎప్పుడు కూలుతుందోనని సమీప ఇళ్లలో నివాసం ఉండేవారు భయాందోళన చెందుతున్నారు. మంజూరైన నిధులతో నూతన భవనం ప్రారంభించి వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**కనీస వసతులు కరువు**

శివన్నగూడ ఆస్పత్రి శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు భయాందోళన చెందుతున్నారు. ఆస్పత్రి భవనానికి నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, కనీస మౌలిక వసతులు లేవు. ఆస్పత్రి భవనంలోకి నిత్యం తేళ్లు, పాములు, విష పురుగులు వస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఫార్మసిస్ట్ డిప్యూటేషన్‌పై, స్వీపర్‌ను ట్రాన్స్‌ఫర్ చేయడంతో అన్ని పనులు తానే చూసుకోవాల్సి వస్తుందని డాక్టర్ వాపోతున్నారు. యునానీ ఆస్పత్రి ద్వారా అందించే ఆయుర్వేద మందులతో త్వరగా ఉపశమనం కలుగుతుందని, సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**మోకాళ్ల నొప్పులు తగ్గడం లేదు**



వైద్యశాలలో డాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. మోకాళ్ల నొప్పులు తగ్గడం లేదు. ప్రైవేట్ డాక్టర్ల వద్ద చూయించుకుంటే డబ్బులవుతున్నాయి. ఉచితంగా మందులు పంపిణీ చేస్తే బాగుంటుంది. పేదవారి కోసం నిర్మించిన ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి.

-నాగబండి మాధవులు, శివన్నగూడ)

**డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉండాలి**



ఆస్పత్రిలో డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉంటే బాగుంటుంది. ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకుంటే అప్పులపాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కనీసం స్వీపర్ కూడా లేకపోవడంతో ఆస్పత్రిని శుభ్రం చేసేవారు కూడా కరువయ్యారు. వర్షాలు కురిస్తే ఆస్పత్రి భవనం కూలుతుందేమోనని భయం వేస్తోంది. సరిపడా డాక్టర్లు, సిబ్బంది ఏర్పాటు చేయాలి.

-ఇరిగిదింద్ల యాదమ్మ, శివన్నగూడ

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

ఆస్పత్రిలో కనీసం కూర్చొనే పరిస్థితి లేదు. నేను కూడా బయట కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గతంలోనే జిల్లా అధికారులు పరిశీలించి వెళ్లారు. అన్ని పనులు నేను ఒక్కడినే చూసుకుంటున్నా. సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నేను నిత్యం విధులకు హాజరవుతూనే ఉన్నా.

-నవీన్‌కుమార్, వైద్యుడు